తేదీ 13.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు

# యువకులకు ఇంద్రియ నిగ్రహం ప్రధానం

**భక్తులందరు చేరి భగవంతుడాయంచు**
**చెవుల కింపుగ నుతి చేయు దినము**
**బీదల వెతలన్ని ప్రీతితో తొలగించి**
**అన్నదమ్ముల మాడ్కి నున్న దినము**
**దైవచింతన చేయు దాస బృందములకు**
**ప్రీతి మృష్టాన్నము పెట్టు దినము**
**మహనీయుడెవరైన మనకడ కేతెంచి**
**చేరి దేవునిగూర్చి చెప్పు దినము**
**అట్టి దినమును దినముగా అనుభవించు**
**తక్కిన దినములన్నియు తద్దినములె**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ప్రేమస్వరూపులారా! మా ఆలిండియా ప్రెసిడెంటు శ్రీనివాసన్ చెప్పాడు – వినయ్ చాలా తెలివిగలవాడని, చదువుకున్నవాడని, ఈ యజ్ఞము నిమిత్తం చక్కని ఏర్పాట్లు చేశాడని. అయితే, అటువంటి యువకులు ఈనాడు చాలా అరుదుగా ఉన్నారు. ప్రపంచమంతయు ఈనాడు ఉన్నటువంటి అశాంతికి మూలకారణం యువకులే!

**చదువులన్నియు చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవగుణంబు మానలేడు**

ఎమ్మేలు, బియ్యేలు చదివి పేరు గాంచిన పెద్దలుకూడా చదువులలోని మర్మ మెఱుగక 'గొప్ప

srisathyasaivachanamrutam

చదువులు చదివినాము, గొప్ప డిగ్రీలు పొందినాము', అని గర్వించుచున్నారు. ఈ గర్వమువల్ల స్వమతముయొక్క సంప్రదాయమును మరచిపోతున్నారు.

**ఆంగ్లభాషా మోహమావరించిననాడె**
**స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె**
**స్వమత విజ్ఞానంబు సన్నగిల్లిననాడె**
**సంస్కార భావంబు సమసిపోయె**
**సంస్కార భావంబు సమసిపోయిననాడె**
**భారత దేశ భాగ్యంబె అణగిపోయె**

ఎక్కడ చూచినను అల్లకల్లోలములే! భౌతిక, లౌకిక, ధార్మిక, ఆధ్యాత్మిక రంగములందుకూడను నైతిక విలువలు సన్నగిల్లిపోయినవి. మానవత్వము మర్యాద కోల్పోయింది. ఈనాడు కూటిపేదమొదలు కోటీశ్వరుని వరకు అందరూ భిక్షగాళ్లమాదిరి తయారయ్యారు. ఈనాడు కూటిపేద భిక్షమెత్తుతున్నాడు, కోటీశ్వరుడూ భిక్షమెత్తుతున్నాడు. ఇందులో ఎవరు పెద్ద? ఎవరు చిన్న? నిజంగా చూస్తే, కూడు లేక అల్లాడుతున్న కూటిపేదనే పెద్ద. ఎందుకంటే, కోటీశ్వరులు తమవద్ద కోట్లాది రూపాయలున్నప్పటికీ జేబులోంచి ఒక నయాపైసా తీసివ్వరు; పవిత్రమైన, ప్రశస్తమైన, పరోపకార సంబంధమైన కార్యములకు ఏమాత్రం సహాయపడరు. పైగా తమ పేరుప్రతిష్ఠలకొరకు పేపర్లలో తమ ఫోటోలు పెద్దగా వేయించుకుంటారు. వారు ఆచరించే కర్మలు చూద్దామా, వాటికి నయాపైసా విలువ ఉండదు. ఇటువంటి పరిస్థితిని చక్కదిద్దడానికి యువకులీనాడు ఉత్సాహంగా ముందడుగు వేయాలి.

**ఇంద్రియాల దుర్వినియోగమువల్లనే యువకులు బలహీనులవుతున్నారు**

దేశమును బాగుపరచాలంటే యువతీ యువకులే అందుకు తగిన సమర్థులు. వారియందున్నటువంటి శారీరకశక్తి, ఇంద్రియశక్తి, బుద్ధిశక్తి మరి ఎవరియందూ లేదు. వారు తలుచుకుంటే ఏమైనా సాధించగలరు. తమయందున్న ఇంద్రియశక్తి, మనో శక్తి, దేహశక్తి, బుద్ధిశక్తి, ఆత్మశక్తి ... సర్వమును సమాజమునకై ఉపయోగపెట్టాలి. దేశమును సంరక్షించాలి. కాని, ఈనాటి యువకులు చిన్నచిన్న విషయాలకు లొంగిపోయి

srisathyasaivachanamrutam

బలహీనులైపోతున్నారు. పదహారు సంవత్సరాల పిల్లవానిని చూస్తే వాడు ఎంతో బక్కపడిపోయి బలహీనంగా ఉంటాడు. కారణ మేమిటి? తినడానికి తిండి లేక కాదు; తన ఇంద్రియాలను దుర్వినియోగ పరచుకొని తనను తానే బలహీనపరచుకుంటున్నాడు. మనిషికి ఇంద్రియశక్తి ప్రాణసమానమైనది. దానిని ఈనాటి యువకులు దుర్వినియోగం చేస్తున్నారు. తల్లిదండ్రులుకూడను పిల్లల చేతికి అమితంగా ధనమిచ్చి వాళ్లు చెడమార్గము పట్టడానికి పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఈవిధంగా తల్లిదండ్రులు చేస్తున్నది కూడా పెద్ద పాపమే! పిల్లలకు స్వేచ్ఛ ఎంతవరకు ఇవ్వాలో అంతవరకే ఇవ్వాలి. మితిమీరిన స్వేచ్ఛ, మితిమీరిన డబ్బు మతిహాని కలిగిస్తాయి. Too much money makes many wrongs. ధనమును సద్వినియోగపరచుకోవాలి. Don't waste money, misuse of money is evil. Don't waste food. Food is God. Don't waste time. Time waste is life waste. ఈనాటి యువకులు ధనమును, ఆహారమును, కాలమును వ్యర్థం గావిస్తున్నారు. అందువల్లనే పాడైపోతున్నారు.

విద్యార్థులారా! యువకులారా! ధనమును వ్యర్థం చేయకూడదు. అట్లే, మాటలనుకూడా వేస్ట్ చేయకూడదు. మౌనమును వహించండి. 'మౌనం కలహం నాస్తి'. మన శ్రీనివాసన్ (అఖిల భారత సాయిసంస్థల అధ్యక్షులు) చెప్పాడు, 'యువకులు టెక్నాలజీలో తగిన శిక్షణ పొందాల'ని. కాని, ఈనాటి మానవుడు నేర్చుకుంటున్నది 'టెక్నాలజీ' కాదు, 'ట్రిక్'నాలజీ! ఈ 'ట్రిక్కుల'వల్లనే మానవుడు చాలా చెడిపోతున్నాడు. మీరందరూ అతి జాగ్రత్తగా మెలగాలి. మన పేరును మనము నిలబెట్టుకోవాలి. మన కుటుంబ గౌరవమును కాపాడుకోవాలి. వ్యష్టి, సమష్టిమధ్యగల సన్నిహిత సంబంధాన్ని గుర్తించి వర్తించాలి.

**మొట్టమొదట దృష్టిని అరికట్టుకోవాలి**

ఈనాటి యువకులయొక్క దృష్టి ఎలా ఉంటున్నది? ఒక్క క్షణమైనా స్థిరంగా నిలువదు. కాకివలె ఇటూ అటూ, ఇటూ అటూ చూస్తూ ఉంటారు. ఏది చూస్తే అది కావాలని ఆశపడతారు. యువకులు మొట్టమొదట తమ దృష్టిని అదుపులో పెట్టుకోవాలి. నేత్రమే మనకు పెద్ద శాస్త్రము. దృష్టి ఎట్టిదో సృష్టి అట్టిది. కనుక, మీరు ఎవ్వరినీ చెడ్డదృష్టితో

sri sathyasai vachanamrutam

చూడకూడదు. అన్నింటినీ ఆశించకూడదు. నేను ఉన్నదున్నట్లుగా చెపుతున్నాను, మీరేమీ అనుకోకండి. మోటార్ సైకిలుమీద కాలేజికి పోయే పిల్లలు ఎక్కడైనా రోడ్డుమీద స్త్రీలు కనిపిస్తే వాళ్లనే చూస్తుంటారు. దీనివల్లనే మోటార్ సైకిళ్ల యాక్సిడెంట్లు కూడా పెరిగిపోయాయి. గర్ల్స్ కాలేజి ముందుగా పోతుంటే వీళ్ళ దృష్టి అంతా ఆ కాలేజీవైపే ఉంటుంది. ఇందుకోసమా భగవంతుడు కన్నుల నిచ్చినది!

**కన్నుల నిచ్చిన దెందుకొ తెలుసా?**
**అన్నీ చూసేటందులకా? కాదు, కాదు, కాదు.**
**కైలాసవాసుని కన్నులారా గాంచేటందుకురా!**

ఇంక, మాటలు చూస్తామా అంటే, వీళ్ల నోటినుండి మంచి మాటలే రావటం లేదు. అన్నీ చెడ్డ పలుకులే! ముగ్గురు పిల్లలు ఒకచోట కలుసుకున్నారంటే, వాళ్లు మాట్లాడేదంతా పిచ్చిపిచ్చి మాటలే! 'వీరు అందంగా ఉన్నారా, వారు అందంగా ఉన్నారా' అంటూ అందాన్ని గురించి మాట్లాడతారే తప్ప ఆత్మానందాన్ని గురించి మాట్లాడరు. ఆనందములో ఉన్న అందము మరి ఎందులోనూ లేదు. ఆనందమే అందము. ఆనందము ననుభవించాలంటే దృష్టిని అరికట్టుకోవాలి. ఎప్పుడైనా మనసులో చెడ్డ భావం కలిగితే, 'ఛ, ఇది నాకు మంచిది కాదు. నేను మానవత్వాన్ని ధరించాను. భగవంతుడు నాకు కన్నుల నిచ్చినది సృష్టిలోని చిత్రవిచిత్రాలను చూడటానికేగాని, శారీరకమైన అందచందాలను చూడటానికి కాదు', అని ఎవరికి వారు బుద్ధి చెప్పుకోవాలి. కన్నులతో సుందరమైన భగవత్ స్వరూపాన్ని దర్శించాలి. కొందరు యువకులు ఎలా ఉన్నారంటే, వాళ్లకు దారిలో ఉన్న దేవాలయం కంటికి కనపడదు; దేవాలయానికి వచ్చిపోయే ఆడవాళ్లే కనపడుతుంటారు. ఇదేనా మానవునికి ఉండవలసిన దృష్టి! ఈవిధమైన 'యూజ్‌లెస్' దృష్టి, 'యూజ్‌లెస్' మాటలు, 'యూజ్‌లెస్' శ్రవణంవల్ల మానవుడు రాక్షసుడుగా మారిపోతున్నాడు. యువకులు చాలా జాగ్రత్తగా ఉండాలి. తమ ఇంద్రియాలను తాము నిగ్రహించుకోవాలి. అప్పుడు ఏ దోషమూ అంటదు.

ప్రేమస్వరూపులారా! పిల్లలపై ఉన్నటువంటి ప్రేమచేతనే నేనింతగా చెబుతున్నాను. ఇలాంటివన్నీ మీలో మీరు దాచిపెట్టుకొనవచ్చును. కాని, నేను దాచిపెట్టుటకు వీలుకాదు.

srisathyasaivachanamrutam

సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవుడు మానవునిగా జీవించగలడు. పెద్దలు, తల్లిదండ్రులుకూడా ఈవిషయంలో తగిన జాగ్రత్త వహించాలి. 'కొడుకు, కొడుకు' అంటూ తల్లిదండ్రులు ప్రాకులాడుతుంటారు. నీ ప్రేమను నీ కొడుకుపై చూపు. అంతేకాని వాని చెడు అలవాట్లపై చూపకూడదు. పిల్లవాడు చెడిపోతే ఎవరికి చెడ్డపేరు? తల్లిదండ్రులకే!

వేదం చెబుతున్నది, 'మాతృదేవో భవ, పితృదేవో భవ'. జన్మకు మూలకారణం తల్లిదండ్రులు. కాబట్టి, పిల్లలు తమ తల్లిదండ్రులను హృదయపూర్వకంగా ప్రేమించాలి. 'తల్లియే నాకు ప్రధానమైన దేవత. తండ్రియే నా దేవుడు. తల్లిదండ్రులే నన్ను కాపాడుతున్నారు', అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను మరచి మనము ఎన్ని ఘనకార్యాలు సాధిస్తే ఏమి ప్రయోజనం! మన సేవాదళంవారు, యువకులు ఇట్టి ప్రచార ప్రబోధలు సల్పి సమాజంలోని చెడును అరికట్టాలి. ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమించి, మన ప్రాణమైనా పణంగా పెట్టి సమాజాన్ని సరియైన దారిలో పెట్టాలి.

**ప్రహ్లాదుని ఆదర్శం**

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి చదువు నిమిత్తం చండ, అమర్కులవద్దకు పంపించాడు. గురువులతనికి అనేక విద్యలు బోధించారు. కొంతకాలము తరువాత హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి పిలిపించి, ఆప్యాయంగా తొడపైన కూర్చోబెట్టుకొని, 'నాయనా! నీ చదువు ఎంతవరకు వచ్చింది? ఏమి నేర్చినావు నీవు?' అని ప్రశ్నించాడు. అప్పుడు ప్రహ్లాదుడు చెప్పాడు,

**"చదివించిరి నను గురువులు**<br>**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే**<br>**చదివినవి కలవు పెక్కులు**<br>**చదువులలోని మర్మమెల్ల చదివితి తండ్రీ!"**

'ఏదీ, నీవు చదివినటువంటి విషయాల్లో ఏదైనా ఒకటి చెప్పు', అన్నాడు తండ్రి. 'ప్రతి ఒక్కరికి సత్శీలము అత్యంత ప్రధానము. సత్శీలము లేనివాడు పశువుతో సమానం' అని



srisathyasaivachanamrutam

ప్రహ్లాదుడు చెప్పేసరికి సభలో ఉన్న వారందరికీ చాలా ఆశ్చర్యం కలిగింది. తండ్రికి కోపం వచ్చింది. పైగా ప్రహ్లాదుడు హరినామస్మరణ చేయటం అతను సహించలేకపోయాడు. తక్షణమే అతని గురువులను పిలిపించి "ఇదేనా మీరు పిల్లలకు నేర్పవలసింది" అని మందలించాడు. ప్రహ్లాదునిచేత హరినామ స్మరణ మాన్పించమని వారిని శాసించాడు. చండామర్కులు గురుకులానికి తిరిగి వెళ్లిన తరువాత ఆ పిల్లవానిని అనేకవిధములుగా దండించి అతనిచేత హరినామస్మరణ మాన్పించడానికి ప్రయత్నం చేశారు. అప్పుడు ప్రహ్లాదుడు "గురువర్యా! హరిని స్మరించవద్దని బోధించే గురువొక గురువా! 'తండ్రి హరి జేరు మనియెడి తండ్రి తండ్రి.' అట్లనే, గురువులుకూడను హరిచింతన చేయుమని శిష్యులకు బోధించాలి. ఇట్టి పవిత్రమైన విషయాలను బోధించకుండా నన్ను విషయవాంఛలలో ముంచడానికి మీరు ప్రయత్నిస్తున్నారు. ఇది నాకక్కర్లేదు", అన్నాడు. 'హరిబోల్ హరి బోల్ హరిహరి బోల్' అంటూ హరినామసంకీర్తన గావిస్తూ అక్కడినుండి బయలుదేరాడు. 'హరికంటే మించిన వారు లేరు', అని తోటివిద్యార్థులకు బోధిస్తూ వచ్చాడు.

**దైవాన్ని గుర్తించే దృష్టిని పిల్లలకు కలిగించాలి**

దైవత్వాన్ని పూజించుటకు, దైవత్వాన్ని గురించి తలంచుటకు మీరుకూడా ప్రహ్లాదునివలె అందరికీ తగినటువంటి ఉత్సాహ ప్రోత్సాహాల నందించాలని నా ఆశ. ఈవిధమైన ప్రచార ప్రబోధలు సల్పినప్పుడు ఒక్క క్షణంలో సమాజములో దివ్యమైన పరివర్తన తీసికొని రావచ్చును. దీనిని ముందుగా మన ఇంటిలో ప్రారంభించాలి. తల్లిదండ్రులు దేహాన్ని మాత్రమే పోషించగలరు. కాని, ఆత్మతత్త్వాన్ని ఎవరు పోషించగలరు? భగవంతుడొక్కడే మనకు దిక్కు. కనుక, దైవాన్ని గుర్తించే దృష్టిని పిల్లలకు కలిగించి తల్లిదండ్రులు సరియైన ఆదర్శమును అందించాలి. "పాంచభౌతికము దుర్బలమైన కాయంబు ఎప్పుడో విడిచేది ఎరుకలేదు." ఈ దేహమును ఎన్నివిధాలుగా పోషించినను ఇది ఏనాడు ఏ క్షణంలో ఏవిధంగా వెళ్లిపోతుందో! పశు, పక్షి, మృగాదులవలె ఆహార, నిద్ర, భయ, మైథునాదులతో కాలం గడపడమే మానవ లక్షణమా? కాదు, కాదు, కాదు. ప్రతి క్షణమును భగవచ్చింతనతో సార్థకం చేసుకోవాలి. అదే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పవలసినది. అదే మన ఇంట, వెంట,

sri sathyasai vahamrutam

జంట, కంట ఉండి మనల్ని కాపాడేటటు వంటిది. ఇట్టి పవిత్రమైన మార్గమును పిల్లలకు బోధించటం తల్లిదండ్రుల ప్రధాన కర్తవ్యం. గురువులుకూడను ఈవిధమైన మార్గమును అనుసరించాలి. గురువులు ఈనాడు 'టెక్స్ట్ బుక్స్'లో ఉన్న విషయాలను మాత్రమే పిల్లలకు బోధిస్తున్నారు. పిల్లలకుకూడా అదే మంచి 'టేస్ట్'గా ఉంటున్నది. కాబట్టి, మన యువకులందరూ ఒక్కొక్క స్కూలుకు వెళ్లి పిల్లలకు సరియైన బోధలు చేయాలి.

**సాయి యువత మార్గదర్శకులుగా ఉండాలి**

ఎక్కడైనా ఎవరైనా పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతూ కనిపిస్తే వాళ్లకు గట్టిగా బుద్ధి చెప్పండి. వాళ్లు ఏమనుకున్నా ఫరవాలేదుకాని, మొట్టమొదట వాళ్ళను గట్టిగా మందలించాలి. 'నీవు మానవునిగా పుట్టి ఈవిధంగా పరస్త్రీల నుద్దేశించి అపవిత్రమైన మాటలు మాట్లాడటం మంచిది కాదు' అని బుద్ధి చెప్పాలి. నీవు పరస్త్రీలను హింసిస్తే నీ ఇంటివారిని పరులు హింసించకుండా ఉంటారా! నీ భార్యను, నీ పిల్లలను జగత్తు వదలిపెడుతుందా! నీవు మొట్టమొదట పరులను ప్రేమించాలి; గౌరవించాలి. అప్పుడే వారినుండి నీవు ప్రేమ, గౌరవాలను అందుకోగలవు. ఈనాడు ముఖ్యంగా యువతీ యువకులు మానవత్వాన్ని పెంచుకోవాలి. సత్యసాయి సంస్థల్లో మేము 'యూత్ వింగ్' (యువజన విభాగము)ను స్థాపించినది ఈ మంగళకార్యంకోసమనే. వాళ్లు మార్గదర్శకులుగా ఉండాలి. బజార్లో ఇష్టమొచ్చినట్లు తిరిగేవారు గాడిదలే తప్ప యువకులు కారు. అలాంటి జీవితం కాదు, మనం గడపవలసింది. నీవు గాడిదవు కాదు, నీలో 'గాడ్' ఉన్నాడు. ఈ సత్యాన్ని గుర్తించు. పవిత్రమైన మానవత్వాన్ని నిలుపుకో. నీ గౌరవాన్ని నీవు కాపాడుకో. ఇదే యువతయొక్క ప్రధానమైన కర్తవ్యం. కొంతమంది పిల్లలు తమ 'టెక్స్ట్ బుక్స్'లోపల పిచ్చిపిచ్చి నవలలు దాచుకొని చాలా గుట్టుగా చదువుతుంటారు. ఈవిధంగా టీచర్లనుకూడా మోసం చేస్తున్నారు. మీ మనసులో ఏవైనా చెడ్డ తలంపులు కలిగితే, 'నేను మానవుడను, పశువును కాను', అని మిమ్మల్ని మీరు హెచ్చరించుకోవాలి. 'మానవుడు' అనే పేరుకు తగినట్లుగా మీరు నడుచుకోవాలి. మానవతా గుణములను పోషించుకున్నప్పుడే మీరు విన్నటువంటి విషయాలకు, చదివినటువంటి విషయాలకు విలువ ఏర్పడుతుంది.

sri sathyasai vachanamrutam

**'కుంజరమును చూసి కుక్కలెన్నో మొరుగు'**

ప్రేమస్వరూపులారా! నాకు మీపైన ఎంతో ప్రేమ ఉన్నది. నా ప్రేమను 'ఇట్టిది, అట్టిది' అని ఎవ్వరూ వర్ణించలేరు. నా ప్రేమలో ఎట్టి వ్యత్యాసమూ లేదు. నా ప్రేమకు సాటి నా ప్రేమయే. ఎవరేమనుకున్నను ఫరవాలేదు; నాకేమీ భయం లేదు. చాలామంది నన్ను కూడను దూషిస్తుంటారు. పేపర్లలో 'న్యూసెన్స్' అంతా వేస్తుంటారు. బయటి దేశాలనుండి వచ్చే 'న్యూసెన్స్'ను కూడా వేస్తుంటారు. బయటి దేశాలవారిని అనుసరించేవాడు నిజమైన జర్నలిస్టా? కాదు, కాదు. నిజమైన జర్నలిస్టు ఆవిధంగా అనుసరించడు. తాను స్వయంగా చూసి అనుభవించినటువంటి విషయాలకే ప్రాధాన్యత ఇస్తాడుగాని, ఏ లండనులోనో, ఏ అమెరికాలోనో పరులు వేసినటువంటి 'న్యూసెన్స్'ను పట్టించుకోడు. అటువంటివన్నీ విని ప్రచారం చేసేవాళ్లు కుక్కలవంటివాళ్లు. ఎక్కడో ఒక కుక్క మొరుగుతుంటే, అది విని ప్రక్క వీధిలో ఇంకో కుక్క కూడా మొరుగుతుంటుంది. కాబట్టి, ఈవిధంగా పరులను అనుసరించేవాడు కేవలం కుక్కవంటివాడే గాని, మానవుడు కాడు. ఎవ్వరేమనుకున్నప్పటికీ మన సత్యము మనదే! సత్యము నీయందే ఉన్నది. నీవు సత్యముతో కూడినటువంటివాడవు. కాబట్టి, అసత్యాన్ని నీవు లెక్కచేయకూడదు. ఎవరైనా ఏమైనా అంటున్నారా... అననీ. ఏవో కుక్కలు మొరుగుతుంటాయి. వాటితో మనకు పనిలేదు. దుర్బుద్ధితో విమర్శించేవాళ్లని మనం కుక్కలవలె చూడాలిగాని, మనుష్యులవలె చూడకూడదు. స్వామి దగ్గరికి ఎంతో మంది వస్తుంటారు. మేము ఎవరికైనా ఇన్విటేషన్లు పంపుతున్నామా? నో, నో, ఎవ్వరికీ ఇన్విటేషన్లు పంపటం లేదు. 'స్వామిదగ్గరికి ఇంతమంది వస్తున్నారే! స్వామికి గొప్ప పేరు వస్తుందాదే!' అన్న అసూయచేత కొందరు స్వామియొక్క పేరును చెడగొట్టాలని చూస్తుంటారు. కావాలంటే వాళ్లనుకూడా ఇంతమందిని తమదగ్గరకు రప్పించుకొమ్మనండి, చూద్దాం. అది అసాధ్యం! అటువంటివాళ్ల దగ్గరకు పదిమందికూడను చేరరు. కారణ మేమిటి? వాళ్లలో ఆ మంచితనం లేదు. మంచితనమే దైవత్వం. ఆ మంచితనమే అందరినీ తనవద్దకు ఆకర్షిస్తుంది.

srisathyasaivachanamrutam

## తేదీ 13.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు

### మీ సత్యమే మీకు సాక్షి

ప్రేమస్వరూపులారా! మీ ప్రేమను మీరు పాడు చేసుకోకండి. మీ ప్రేమను మీరు పెంచుకుంటూరండి. అప్పుడే మీ మనస్సు పవిత్రమౌతుంది; మానవత్వం సార్థకమవుతుంది. అప్పుడే మీరు మానవులనిపించుకుంటారు. లేకపోతే, దానవులుగా మారిపోతారు. పరుల మాటలు విని మోసపోకండి. ఇక్కడ విన్న విషయాలను మనసులో భద్రపరచుకోండి. దైవాన్ని మీహృదయంలో నిల్పుకోండి.

ప్రేమస్వరూపులారా! నేను ఇంత కఠినంగా చెబుతున్నానని మీరు బాధపడుతున్నారేమో! దీనికి మీరు ఆనందించాలేగాని, ఏమాత్రము నొచ్చుకో కూడదు. దైవత్వం ఎవ్వరికీ కానరాదు. అది కనిపించి 'అడ్వర్‌టైజ్' చేసుకునేటటువంటిది కాదు. కొంతమంది తప్పుడు విషయాలను 'అడ్వర్‌టైజ్' చేస్తుంటారు. వాళ్ల బుద్ధి ఎంతగా దిగజారిపోయిందో చెప్పడానికి వీలుకాదు. ఇది కేవలం మూర్ఖత్వం. నిజంగా వాళ్లు మనుష్యులైతే ఇలాంటి తప్పుడు విషయాలను 'అడ్వర్‌టైజ్' చేయరు. వాళ్లకంత ఆసక్తిగా ఉంటే తాము స్వయంగా వచ్చి చూసి ఆనందాన్ని అనుభవించాలి. ఏవో తాము విన్నటువంటివన్నీ విచక్షణారహితంగా పేపర్లో వేయటం చాలా పొరపాటు. చదివేవారుకూడా ఈ సత్యాన్ని గుర్తించి వర్తించాలి. సత్యాన్ని అనుసరించి మీరు మెలగుతూ ఉండినప్పుడు ఈ జగత్తులో మిమ్మల్ని జయించగలవాడు, దండించగలవాడు ఒక్కడూ ఉండడు. మీరు సత్యాన్ని పాటించండి. మీ సత్యమే మీకు సాక్షి!

**మనసుకు మనసు సాక్షి, దేహానికి గుణము సాక్షి**
**మూఢునకు మూర్ఖం సాక్షి, సర్వమునకు స్వామి సాక్షి**

మనం 'ఫూల్స్' కాకూడదు; భగవంతునికి అర్పితమయ్యే పూలు కావాలి మనం. హృదయ పుష్పాన్ని భగవంతునికి అర్పించవలసినదిపోయి అందుకు విరుద్ధంగా నడుచుకుంటూ 'ఫూల్స్' మాదిరి తయారు కావటం మంచిది కాదు.

srisathyasaivachanamrutam

**'ఎడ్యుకేషన్'తోపాటు 'ఎడ్యుకేర్' కూడా ఉండాలి**

విద్యార్థులారా! మున్ముందు చెప్పవలసినవి ఇంకా ఎన్నియో ఉన్నాయి. మిమ్మల్ని సరిచేసే నిమిత్తమై నేనివన్నీ ప్రస్తావిస్తున్నాను. ప్రేమ, ప్రేమ, ప్రేమ, ప్రేమ! ప్రేమ ఒక్కటి నిలుపుకోండి, చాలు. ఆ ప్రేమను అన్నింటిపైన మీరు నిల్పుకోకూడదు. భగవంతునిపై మాత్రమే ప్రసరింపజేయాలి. అప్పుడే మీరు బాగుపడతారు. లేకపోతే, ఎన్ని చదువులు చదివి ఏమి ప్రయోజనం! ఈనాటి 'ఎడ్యుకేషన్' అంతయు 'ఎజిటేషన్'కు దారితీస్తున్నది. ఈ పరిస్థితిని చక్క చేయాలంటే, 'ఎడ్యుకేషన్' మాత్రమే కాకుండా 'ఎడ్యుకేర్' కూడా ఉండాలి. 'ఎడ్యుకేషన్' అనేది మనకు గ్రంథములనుండి లభిస్తుంది. 'ఎడ్యుకేర్' అనేది మన హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. కనుక, మనం 'ఎడ్యుకేర్'ను చేపట్టాలి. 'ఎడ్యుకేర్' అనగా సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ మొదలైన మానవతా గుణములను మన హృదయమునుండి ఆవిర్భవింపజేసుకోవాలి. లౌకికమైన 'ఎడ్యుకేషన్' బుక్కు (పుస్తకం) నుండి లభ్యమవుతుంది. బుక్కు ముక్కువంటిది. కాని, 'ఎడ్యుకేర్' శ్వాసవంటిది. శ్వాస లేకపోతే ప్రాణమే లేనట్లు. అదేరీతిగా, 'ఎడ్యుకేర్' లేకపోతే మానవత్వం నిలువజాలదు.

**మన భారతీయులే వేదమును మరచిపోతున్నారు**

దివ్యాత్మస్వరూపులైన విద్యార్థులారా! మీరందరూ చాలా మంచిపిల్లలే! బంగారువంటి పిల్లలే! అయితే, మీరు 14 కేరట్ల బంగారం మాదిరి ఉండకూడదు; 24 కేరట్ల బంగారంలా ఉండాలి. మీ విలువను ఏమాత్రము తగ్గించుకోకూడదు. ఆవిధంగా ఉంటే మీ అందరికీ నేను ఎంతో సహాయం చేస్తాను. ఆర్థికంగా, పారమార్థికంగా అన్నింటియందు మీకు సహాయం చేస్తాను. మీరు మంచిబిడ్డలుగా తయారుకండి. మంచి పేరు తెచ్చుకోండి. *(స్వామి ఒక అమెరికన్ విద్యార్థిని, ఒక రష్యన్ విద్యార్థిని వేదికపైకి పిలిచి వారిరువురిచేత నమకము, శ్రీసూక్తము చెప్పించారు)*

ఈ అబ్బాయి అమెరికావాడు, ఆ అబ్బాయి రష్యావాడు. ఇద్దరికీ ఎటువంటి ఐకమత్యం కుదిరిందో చూడండి. ఈ పిల్లలకు నమకము, చమకము మొదలైన వేదమంత్రాలు అనేకం తెలుసు. ఇంకా ఇతర దేశాలవారుకూడా వచ్చి వేదం నేర్చుకుంటున్నారు. కాని, మన

sri sathyasai vachanamrutam

భారతీయులే వేదమును మరచిపోతున్నారు. విదేశీయులు సంస్కృత భాషలో ఉన్న వేదమంత్రాలను నేర్చుకొని సుస్పష్టంగా ఉచ్చరించగలుగుతున్నారు. మన భారతీయులు నేర్చుకుంటున్నదేమిటి? 'డింగ్ డాంగ్ బెల్ పుస్సీ ఈజ్ ఇన్ ద వెల్'! ఇలాంటివా మనం నేర్చుకోవలసినవి! కాదు, కాదు. పవిత్రమైన భారతీయతత్త్వాన్ని గుర్తించాలి. భారత దేశమునందు నీతియే తల్లి, నిజాయతీయే తండ్రి, శాంతమే చెల్లెలు, ధైర్యమే సోదరుడు. ఇట్టి శాశ్వతమైన, పవిత్రమైన సంబంధాలను విస్మరించి లౌకికమైన, క్షణభంగురమైన సంబంధాలను మీరు పెంచుకుంటున్నారు. ఈ పిచ్చిపిచ్చి సంబంధాలను పెట్టుకోకూడదు. Tell me your company, I shall tell you what you are. మీరు ఎలాంటివారితో స్నేహం చేస్తారో అలాంటివారే మీరవుతారు. కాబట్టి, సత్సంగంలో ప్రవేశించండి.

ఇంకా కావలసినంత టైమ్ ఉంది కనుక ముందు మీకు తెలుపవలసినవన్నీ బాగా తెలుపుతాను. ఎవరేమన్నా నాకేమీ భయం లేదు. నా సత్యమునే నేను ఆధారం చేసుకున్నాను. సత్యముపైన నమ్మకం ఉన్నటువంటివాడు ఎవ్వరికీ భయపడడు.

**(తేదీ 13.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam